## బహుజన రాజ్యాధికారమే లక్ష్యం


మాట్లాడుతున్న గౌడ సంఘం రాష్ట్ర నాయకులు

కారేపల్లి, అక్టోబర్ 27: బహుజన రాజ్యాధికారమే లక్ష్యమని గౌడ సంఘం నాయకులు అన్నారు. తాళ్లూరి చంద్రయ్య గౌడ్, కోయిల శ్రీను అధ్యక్షతన ఆదివారం స్థానిక గంగమ్మగుడి ఫంక్షన్‌హాల్‌లో గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ మండల సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో బహుజన టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సుంకర శ్రీను మాట్లాడుతూ.. సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ చూపిన మార్గంలో బహుజన రాజ్యం సాధించుకునే లక్ష్యంగా గౌడ జనుల కర్తవ్యమన్నారు. బహుజన పొలిటికల్ సెంటర్ రాష్ట్ర నాయకులు పోడకంటి రాంబాబు మాట్లాడుతూ.. అగ్రకుల పార్టీలను వీడి బహుజన రాజ్యం సాధించడమే మోకు దెబ్బ ప్రధాన లక్ష్యంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో గౌడ సంఘాల రాష్ట్ర జేఏసీ చైర్మన్ అమరగాని వెంకన్న, లింగన్నబోయిన లక్ష్మణ్, ధారా వెంకయ్య, తాళ్ల శ్రీను, రామారావు, రమేష్, పాసిని నాగేశ్వరరావు, తాళ్లూరి చంద్రకళ, పానుగంటి లక్ష్మి, పొలగాని శ్రీనివాసరావు, చీమలచారి సత్య పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు పరామర్శ


బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థికసాయం అందజేస్తున్న తోట రామారావు

ఖమ్మం రూరల్, అక్టోబర్ 27 : మండల పరిధిలోని చింతపల్లి గ్రామంలో ఇటీవల వివిధ కారణాలతో మృతి చెందిన పలు కుటుంబాలను ప్రముఖ వ్యాపారి, మాజీ కార్పొరేటర్ తోట రామారావు ఆదివారం పరామర్శించారు. ఆరెంపుల జార్జి, కొట్టె ఉమారాణి కుటుంబాలను పరామర్శించి వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు. ఇరు కుటుంబాలకు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ముత్యం చిన్న కృష్ణారావు, తోట సుధాకర్, ఆరెంపుల రామయ్య తదితరులు ఉన్నారు.

## వాటర్‌ప్లాంట్ ప్రారంభం

తిరుమలాయపాలెం, అక్టోబర్ 27: మండలంలోని పిండిప్రోలు గ్రామంలో గౌతమి విద్యాసంస్థల డైరెక్టర్ కాంపాటి బాబూరావు రూ.5 లక్షల తన సొంత ఖర్చులతో మినరల్ వాటర్‌ప్లాంట్‌ను నిర్మించి ఆదివారం ప్రారంభించారు. భార్య ప్రమీల, కుటుంబసభ్యులతో కలిసి ప్రారంభించి అనంతరం మాట్లాడుతూ సేవా దృక్పథంతో ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు ఉచితంగా అందించే లక్ష్యంతో వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు పాల్గొన్నారు.

## 54వ సారి రక్తదానం..

తిరుమలాయపాలెం, అక్టోబర్ 27: తిరుమలాయపాలెం మండలంలోని సుద్ద వాడుతండాకు చెందిన బీఆర్‌ఎస్ మండల నాయకుడు ఆర్మి రవి 54 మారు రక్తదానం చేశాడు. పోలీసుల అమరవీరుల దినోత్సవం సందర్భంగా శనివారం ఆయన రక్తదానం చేశారు. పలుమార్లు రక్తదానం చేసి అనేకమంది ప్రాణాలు కాపాడిన ఆర్మి రవిని పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు. రోగుల ప్రాణాలను కాపాడేందుకు తనతోపాటు తమ యూత్ సభ్యులు రక్తదానం చేసేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉన్నట్లు రవి తెలిపారు.

## 'ఎస్సీ వర్గీకరణ' పేరుతో ప్రభుత్వం కుట్ర


మాట్లాడుతున్న సుధాకర్

రఘునాథపాలెం, అక్టోబర్ 27 : అంబేద్కర్ సిద్ధాంతాన్ని రూపుమాపేందుకే ఎస్సీ వర్గీకరణ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందని మాల మహానాడు ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు కొట్టె సుధాకర్ ఆరోపించారు. ఆదివారం రఘునాథపాలెం మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో మాల మహానాడు మండల కమిటీ ఎన్నిక సమావేశం జరిగింది. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నవంబర్ 24న హైదరాబాద్‌లో జరిగే బహిరంగ సభకు మాలలు అధికసంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సంఘం నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా అంతోటి బుచ్చయ్య, ఈర్జాల లలితారావు, ఉపాధ్యక్షులుగా దానయ్య, బాబూరావు, చెన్నయ్య, సుదర్శనం, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఉపేందర్, గౌరవ సలహాదారులుగా రెంటాల ప్రసాద్, కొర్లపాటి రామారావు, ధారా శ్యాంను ఎన్నుకున్నారు.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

ముదిగొండ, అక్టోబర్ 27: మండలంలో పలు అభివృద్ధి పనులకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదివారం శంకుస్థాపన చేశారు. మండల పరిధిలోని చిరుమర్రి, ముదిగొండ, వెంకటాపురం, యడవల్లి, కట్టకూరు, మాధాపురం గ్రామాల్లో రూ. 19.95 కోట్లతో నిర్మాణం చేపట్టనున్న బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రోడ్డు నిర్మాణ పనులను నాణ్యతగా, త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### ఉప ముఖ్యమంత్రికి సన్మానం

మామిళ్లగూడెం, అక్టోబర్ 27 : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు డీఏ ప్రకటించడం పట్ల రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన వనరులశాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కకు ఖమ్మం జిల్లా ఉద్యోగ సంఘాల ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం కలెక్టరేట్‌లో డిప్యూటీ సీఎంను శాలువాలతో సత్కరించారు. నవంబర్ 3న జిల్లాలో జరిగే సకల ఉద్యోగుల సమ్మేళనం వనసమారాధనలో పాల్గొనాలని కోరారు. దేవరకొండ సైదులు, వేలాద్రి, గుంటుపల్లి శ్రీనివాస్, జయపాల్, విజయ్‌కుమార్, బాలకృష్ణ, దుర్గాప్రసాద్, శ్రీకాంత్, రమేష్, ఆంజనేయులు, రాధాకృష్ణ, ప్రకాష్‌రావు, రుక్మారావు, శంకర్ పాల్గొన్నారు.

### స్వాతంత్ర్య సమరయోధునికి పరామర్శ

చింతకాని, అక్టోబర్ 27: మండల పరిధిలో నాగులవంచ గ్రామానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధులు అంబటి వీరయ్యను రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన వీరయ్య యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

### సమస్యలు పరిష్కరించాలి

బోనకల్లు, అక్టోబర్ 27: మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో పలు సమస్యలు పరిష్కరించాలని సీపీఐ నాయకులు తోట రామాంజనేయులు, యంగల ఆనందరావు, తూము రోషన్‌కుమార్ ఆదివారం రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు వినతిపత్రం అందజేశారు. మండల కేంద్రంలో ఆర్వోబీ బ్రిడ్జి విద్యుత్ దీపాలు లేకపోవడంతో రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, తక్షణమే విద్యుత్ దీపాలు ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు. జర్నలిస్టులకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వడంతో పాటు, ఇందిరమ్మ ఇళ్లలో ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో గుంపుల జయరాజు, ఆకెన పవన్, గుడిద కృష్ణ, యంగల పెద్దరమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలి


మాట్లాడుతున్న కేవీ కృష్ణారావు

ముదిగొండ, అక్టోబర్ 27: కాంగ్రెస్ సర్కార్ తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర స్టీరింగ్ కమిటీ చైర్మన్ కేవీ కృష్ణారావు అన్నారు. మండలంలోని సువర్ణాపురం గ్రామంలో ఆదివారం జరిగిన ఉద్యమకారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర సాధన కోసం అన్నీ వదులుకొని పోరాడి ఎంతో కోల్పోయామని, నాటి మన పోరాటం ఫలితంగానే రాష్ట్రం సిద్ధించిందని, ఎందరో అమరుల త్యాగ ఫలితమే రాష్ట్ర ఆవిర్భావమని అన్నారు. జిల్లాలో ఉన్న ముగ్గురు మంత్రులకు ఉద్యమ నేపథ్యం లేదని, అందుకే వారు ఉద్యమకారుల గురించి ఒక్కరోజు కూడా మాట్లాడలేదని ఆరోపించారు. తరువాత మండల కమిటీని నియమించారు అధ్యక్షుడిగా గాలి రాము, కార్యదర్శిగా గువ్వల సంగీతరావును ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పసుపులేటి నాసరయ్య, పగడాల నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఐదు పెండింగ్ డీఏలను విడుదల చేయాలి

### – టీఎస్ యూటీఎఫ్ నాయకుల డిమాండ్

ఖమ్మం రూరల్, అక్టోబర్ 27: ఎన్నికల సమయంలో ప్రభుత్వ ఉద్యోగులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను తక్షణమే విడుదల చేయాలని టీఎస్ యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని యూటీఎఫ్ భవన్‌లో కామేపల్లి, సింగరేణి, ఖమ్మంరూరల్ మండలాల యూటీఎఫ్ మహాసభలు జరిగాయి. సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జీవీ నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఐదు డీఏలతోపాటు, 2023 జూలై నుంచి రెండో పీఆర్సీని అమలు చేయాలన్నారు. పమ్మి రాంబాబు, రాందాస్, నాగేశ్వరరావు, నవీన్, మహేష్, నర్సింహారావు, కృష్ణారావు, మంగీలాల్, శేషయ్య, నాగమణి పాల్గొన్నారు.

### నూతన కమిటీ ఎన్నిక

యూటీఎఫ్ భవన్‌లో మహబూబ్‌అలీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రూరల్ మండల యూటీఎఫ్ నూతన కమిటీ ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా ఎన్.నవీన్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా పణతి మహేష్, ఉపాధ్యక్షుడిగా ఎం.ప్రసాదరావు, ఎన్.శైలజ, కోశాధికారిగా కే.సతీష్, కార్యదర్శులుగా వీ శ్రీనివాసరావు, ఎ.సత్యనారాయణ, బీ.శ్రీనివాసరావు, నవీన్‌కుమార్, లక్ష్మీకుమారి, శ్రీలత, రంగమ్మ, సువర్ణ ప్రసాద్, మహేష్, సక్కుబాయి, ఆడిటర్‌గా శేషగిరిరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## 'కోటమైసమ్మ ఆలయ ప్రతిష్ట దెబ్బ తీయొద్దు'


మాట్లాడుతున్న గ్రామస్తులు

కారేపల్లి, అక్టోబర్ 27: దేవాదాయశాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఉసిరికాయలపల్లి కోటమైసమ్మ ఆలయాన్ని రాజకీయాల్లోకి లాగొద్దని గ్రామస్తులు ఇస్లావత్ శంకర్, భూక్యా మాన్‌సింగ్, లకావత్ గోపీ అన్నారు. స్థానిక దేవాలయ ప్రాంగణంలో ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. ఇక్కడ ప్రతి ఏటా దసరాకు ఐదు రోజుల పాటు జాతర జరుగుతుందని, ఈ జాతరకు రాష్ట్ర నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకుంటారన్నారు. ఇటీవల కొంతమంది గిట్టని వారు ఆలయ ప్రతిష్ట దెబ్బతినే విధంగా అనుచిత వ్యాఖ్యలు చేయడం బాధాకరమన్నారు. అలాంటి దుష్ప్రచారం వల్ల ఆలయానికి చెడుపేరు తీసుకురావాలనేది వారి ఉద్దేశమన్నారు. సమావేశంలో గ్రామస్తులు గుంపిడి నాగేశ్వరరావు, లకావత్ గోపీనాథ్, పొడుగు రమేష్, ఉండం కుమార్, రాందాస్, రమేష్, హాతీరాం తదితరులు పాల్గొన్నారు.

## కూచిపూడిలో ఖమ్మం చిన్నారికి కీర్తి పతాకం

రఘునాథపాలెం, అక్టోబర్ 27: ఖమ్మం మమత డెంటల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీ వెంకటేశ్వరరావు కుమార్తె మాన్వి కూచిపూడి రంగంలో కీర్తి పతాకాన్ని సాధించింది. వింటేజ్ హెరిటేజ్ టూర్‌లో భాగంగా శ్రీగానాలయం వారు అక్టోబర్ 2024 నుంచి సెప్టెంబర్ 2025 వరకు దేశవ్యాప్తంగా 36నగరాల్లో టూర్ నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా అక్టోబర్ 27న హైదరాబాద్‌లో జరిగిన తొలి ప్రదర్శనలో మాన్వి తన నృత్యంతో సభికులను ఆకట్టుకొని కీర్తి పతాకాన్ని సాధించింది. కూచిపూడి నాట్య గురువు డాక్టర్ ఎస్‌పీ భారతి, మాజీ డీఆర్‌డీవో శాస్త్రవేత్త పీ రాఘవేంద్ర చేతుల మీదుగా పతకాన్ని అందుకుంది.

## పంచాయతీ కార్మికుల వేతనాలు చెల్లించాలి

రఘునాథపాలెం, అక్టోబర్ 27 : గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికుల వేతనాలను తక్షణం విడుదల చేయాలని గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పిట్టల మల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండల పరిధి రేగులచలక గ్రామంలో మండల కార్యదర్శి రాజగోపాల్ అధ్యక్షతన జరిగిన సమావేశాన్ని ఉద్దేశించి మల్లయ్య మాట్లాడారు. దసరా నాటికే చెల్లిస్తామని మంజూరు చేసిన ప్రభుత్వం నేటికీ సిబ్బంది అందలేదన్నారు. దీపావళి నాటికైనా చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జీపీ కార్మికులు జీ రాందాస్, బానోతు మంగీలాల్, లింగయ్య, రాము, మధు, ఉపేందర్, వీరయ్య, జాన్, విజయలక్ష్మి, శ్రీను, సైదులు, లాలు, కృష్ణ తదితరులు ఉన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

PLOT FOR SALE

★గజం: 2,500/- నార్కెట్‌పల్లి దగ్గర గేటెడ్ కమ్యూనిటీ వెంచర్‌లో స్విమ్మింగ్ పూల్, కాటేజీ, 30 పండ్ల మొక్కలు, 30 ఎర్రచందనం మొక్కలతో 5 & 10 గుంటల ప్లాట్స్ అమ్మబడును. దసరా ఆఫర్ 10 గ్రా. గోల్డ్ కలదు. 7569587521.

NT-338783

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

## వ్యక్తి ఆత్మహత్య

మామిళ్లగూడెం, అక్టోబర్ 27 : మద్యం మత్తులో వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం ఖమ్మం నగరంలో చోటుచేసుకుంది. ఒకటో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని చర్చికాంపౌండ్ ప్రాంతంలో నివాసముంటున్న బుడి రవికుమార్(40) పెయింటింగ్ పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. అతిగా మద్యం తాగే అలవాటు ఉన్న అతను ఇంట్లో కుటుంబసభ్యులు లేని సమయంలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య దేవమణి ఫిర్యాదు మేరకు ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి పాప, బాబు ఉన్నారు.

## కళాశాలకు నిధులు కేటాయించాలి

ఖమ్మం ఎడ్యుకేషన్, అక్టోబర్ 27 : వైరా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి నిధులు కేటాయించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు కళాశాల ప్రిన్సిపాల్ ఎల్.నవీన్ జ్యోతి వినతిపత్రం అందజేశారు. జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రిని క్యాంపు కార్యాలయంలో ఆమె కలిశారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించి త్వరలోనే నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అధ్యాపకులు కొప్పిశెట్టి సురేశ్, కంచర్ల శ్రీకాంత్ ఉన్నారు.

## మహిళలు న్యాయవాదులుగా రాణించాలి

ఖమ్మం లీగల్, అక్టోబర్ 27: ఖమ్మంలోని సప్తపది ఫంక్షన్‌హాలులో 'రాజ్యాంగ పరిరక్షణలో మహిళల పాత్ర' అనే అంశంపై జరిగిన సెమినార్‌లో ఐలు న్యాయవాదులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో మహిళలు అన్నిరంగాల్లో రాణించాలన్నారు. రాజ్యాంగంలో మహిళలకు ఉన్న హక్కులు, రక్షణ గురించి వివరించారు. ఐలు రాష్ట్ర అధ్యక్షుడు కొల్లి సత్యనారాయణ మాట్లాడుతూ న్యాయవాదుల పక్షాన ఐలు నిత్యం పని చేస్తున్నదని అన్నారు. ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ ఖమ్మం జిల్లా కమిటీ కో కన్వీనర్‌లుగా కే.రామలక్ష్మి, పి.శ్రీలక్ష్మి, రాష్ట్ర నూతన కన్వీనర్‌గా చందాల శైలజను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## డీఏ ప్రకటనతో ఉద్యోగుల్లో అసంతృప్తి

ఖమ్మం ఎడ్యుకేషన్, అక్టోబర్ 27 : ఐదు వాయిదాల కరువు భత్యం(డీఏ) పెండింగ్‌లో ఉండగా ఒక వాయిదాని మాత్రమే విడుదల చేయడం బాధాకరమని టీఎస్ యూటీఎఫ్ ఖమ్మం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జీవీ నాగ మల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉద్యోగులు జీర్ణించుకోలేకపోతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని పునః సమీక్షించుకోవాలని కోరారు.

## గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు

వేంసూరు, అక్టోబర్ 27: మండలంలోని పలు గ్రామాల్లో గ్రామ పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో ఆదివారం పారిశుధ్య కార్యక్రమాలు ముమ్మరంగా సాగాయి. పంచాయతీ సిబ్బంది గ్రామాల్లో రోడ్లవెంబడి చెత్తాచెదారం, పిచ్చిమొక్కలు తొలగించి శుభ్రం చేశారు. కార్యదర్శులు పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ఖమ్మం రూరల్, అక్టోబర్ 27 : రోడ్డు ప్రమాదంలో యువకుడు అక్కడికక్కడే మృతిచెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఖమ్మంరూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఆరెంపుల గ్రామానికి చెందిన అరెకోట వీరబాబు(36) పొన్నెకల్ గ్రామం నుంచి ఖమ్మం వస్తున్న తరుణంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఘటనా స్థలాన్ని పోలీసులు సందర్శించి మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## విద్యుత్ ప్రమాదాలపై అవగాహన

మామిళ్లగూడెం, అక్టోబర్ 27 : తెలంగాణ ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలోని 16 సర్కిళ్లలో విద్యుత్ ప్రమాదాల నివారణ, అప్రమత్తలపై వినియోగదారులకు అవగాహన పెంచుతున్నామని సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ పరికరాల వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను సిబ్బంది వివరిస్తున్నారని పేర్కొన్నారు. రైతుల కోసం ప్రత్యేకంగా పొలంబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వదులు లైన్లు, ఒంగిన స్తంభాలు, ఎర్తింగ్స్, ట్రాన్స్‌ఫార్మర్ల మర్మతుల కోసం ఉన్న టోల్‌ఫ్రీ నెంబర్ 1912పై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. చింతకాని మండలం లచ్చగూడెం గ్రామానికి చెందిన ప్రసాద్ అనే వ్యక్తి మృతి విషయంలో జేఎల్‌ఎంపై సస్పెన్షన్ చేశామని తెలిపారు. నాణ్యమైన విద్యుత్ సరఫరాకు 24 గంటలు అందుబాటులో ఉండే 18004250028 నెంబర్‌కు ఫిర్యాదులు చేయాలని పేర్కొన్నారు.

## దీపావళి పటాకుల దుకాణాలకు డ్రా ద్వారా స్థలాల కేటాయింపు

మామిళ్లగూడెం, అక్టోబర్ 27: దీపావళి క్రాకర్స్ దుకాణాలకు స్థలాల కేటాయింపును ఆదివారం డ్రా ద్వారా చేపట్టారు. పోలీస్ కాన్ఫరెన్సు హాల్‌లో అడిషనల్ డీసీపీ అడ్మిన్, టౌన్ ఏసీపీ రమణమూర్తి ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్న దుకాణదారులకు స్థలాల కేటాయింపు ప్రక్రియ జరిగింది. నగరంలోని ఎస్‌ఆర్‌ఎండ్ బీజీఎన్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో షాపుల నిర్వాహణకు 132 దరఖాస్తులు రావడంతో అధికారులు వాటిలో నిబంధనల ప్రకారం లేని 4 దరఖాస్తులను తిరస్కరించారు. 128 దరఖాస్తులకు లాటరీ తీసి 122 దుకాణాలకు స్థలాల కేటాయింపు చేశారు. మరో 6 దుకాణాలకు స్థలం సరిపోకపోవడంతో కేటాయించలేదు. ఈ దుకాణాలు నేటి నుంచి ఈ నెల 31వ తేదీ వరకు వినియోదారులకు అందుబాటులోకి రానున్నాయి. కార్యక్రమంలో క్రాకర్స్ దుకాణాల నిర్వాహకులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## వీ.ఎం.బంజరలో ఉచిత వైద్యశిబిరం

పెనుబల్లి, అక్టోబర్ 27: పీఎస్ఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో మండలంలోని వీ.ఎం. బంజర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో ఖమ్మం కిమ్స్ హాస్పిటల్ వైద్యులు సుమారు 425 మందికి పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో ఖమ్మం కిమ్స్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ భీమ్‌రెడ్డి, బాబురెడ్డి, చావా శివరామకృష్ణ, వైద్యసిబ్బంది, ఖమ్మం కిమ్స్ హాస్పిటల్ స్టాఫ్, మార్కెటింగ్ మేనేజర్ వెంకటేశ్వరరావు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు మండలంలో కొండబాల, లింగాల పర్యటన

ఎర్రుపాలెం, అక్టోబర్ 27: మండలంలోని మొలుగుమాడు గ్రామానికి చెందిన ఖరీదు కోటేశ్వరరావు మాతృమూర్తి చిట్టెమ్మ ఇటీవల మృతిచెందింది. సోమవారం జరుగనున్న చిట్టెమ్మ దశదినకర్మకు బీఆర్‌ఎస్ నేతలు కొండబాల కోటేశ్వరరావు, లింగాల కమల్‌రాజు హాజరుకానున్నట్లు బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పంబి సాంబశివరావు, కార్యదర్శి యన్నం శ్రీనివాసరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

## హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యం

### – సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని


మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం

తిరుమలాయపాలెం, అక్టోబర్ 27 : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో వైఫల్యం చెందిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. తిరుమలాయపాలెం మండలంలోని పిండిప్రోలు గ్రామంలో ఆదివారం జరిగిన సీపీఎం మండల మహాసభలో ఆయన మాట్లాడారు. రైతు రుణమాఫీ పూర్తిస్థాయిలో అమలు చేయలేదని అన్నారు. ఇప్పటికైనా ప్రజా సంక్షేమంపై దృష్టిసారించి హామీలన్నింటిని అమలు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి హితవు పలికారు. మహాసభల సందర్భంగా గ్రామంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ సభలో పొన్నం వెంకటేశ్వర్లు, బుగ్గవీటి సరళ, నున్నా నాగేశ్వరావు, బండి రమేష్, శ్రీను, బషీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు నేరడ విద్యార్థి


ఎంపికైన ప్రవీణ్

చింతకాని, అక్టోబర్ 27: రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు మండలంలోని నేరడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన గోగుల ప్రవీణ్ ఎంపికైనట్లు ఎంఈవో వీరపునేని శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. కొత్తగూడెంలో జరిగిన కబడ్డీ అర్హత పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని పేర్కొన్నారు. హెచ్‌ఎం శ్రీనివాసరావు, వ్యాయామ ఉపాధ్యాయురాలు ఈ భాగ్య, ఎస్‌ఎంసీ సభ్యులు విద్యార్థిని అభినందించారు.

## కార్తీకమాస అభిషేక మహోత్సవ పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లిటౌన్, అక్టోబర్ 27: నవంబర్ 2 నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకు పెనుబల్లి మండలంలో నీలాద్రీశ్వరస్వామి ఆలయ సన్నిధిలో కార్తీకమాస దీక్ష అభిషేక మహోత్సవం, పూజా కార్యక్రమాల వాల్‌పోస్టర్లను ఆదివారం సత్తుపల్లిలోని ఎమ్మెల్యే మట్టా రాగమయి నివాసంలో ఎమ్మెల్యే రాగమయి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు మట్టా దయానంద్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సత్తుపల్లి ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్, నీలాద్రి ఆలయ ఈవో, చైర్మన్ చీకటి చిన్నస్వామి, ఆలయ డైరెక్టర్లు, అర్చకులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## మసీదు కమిటీ సదర్‌కు సన్మానం

సత్తుపల్లి, అక్టోబర్ 27: సత్తుపల్లి జామియా మసీదు, మార్కెట్ మసీదు సదర్‌గా ఎన్నికైన షేక్ నయబ్‌రసుల్, జనరల్ సెక్రటరీగా ఎన్నికైన కమల్‌పాషాను ఆదివారం ఎమ్మెల్యే మట్టా రాగమయి, దయానంద్ దంపతులు శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముస్లింలకు ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని, నిర్మాణంలో ఉన్న షాదీఖానను త్వరలోనే పూర్తి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో గ్రాండ్ మౌళాలి, బుడేన్ తదితరులు ఉన్నారు.

## జేవీఆర్ కళాశాలలో ముగిసిన క్రికెట్ టోర్నమెంట్


విజేతలుగా నిలిచిన రెడ్‌స్లాషర్స్ టీం

సత్తుపల్లిటౌన్, అక్టోబర్ 27: సత్తుపల్లిలోని జేవీఆర్ డిగ్రీ కళాశాల గ్రౌండ్‌లో రెండు రోజులుగా జరుగుతున్న జేవీఆర్ కప్ దివాళి ఎడిషన్ క్రికెట్ టోర్నమెంట్‌లో రెడ్‌స్లాషర్స్ టీం విజేతగా నిలిచింది. ఆదివారం జరిగిన ఫైనల్స్‌లో రెడ్‌స్టాషర్స్ టీం, ఐజీ ఆరెంజ్ ఆర్మీ టీంలు తలపడగా 20 ఓవర్లలో రెడ్‌స్టాషర్స్ టీం 180 పరుగులు సాధించగా ఐజీ ఆరెంజ్ టీం 171 పరుగులు సాధించింది. దీంతో రెడ్‌స్టాషర్స్ టీం దివాళి ఎడిషన్ కప్పును గెలుచుకున్నది. మున్సిపల్ వైస్‌చైర్మన్ సుజలారాణి విజేత జట్టుకు కప్ అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ తోట సుజలరాణి, టోర్నమెంట్ నిర్వహకులు చాత్రాతి పార్థు, చల్లారి మనోజ్, శివ, వంశీ పాల్గొన్నారు.

## కార్పొరేట్లకు రాయితీలు.. సామాన్యులపై భారాలు


మాట్లాడుతున్న మాచర్ల భారతి

సత్తుపల్లి, అక్టోబర్ 27: కార్పొరేట్ శక్తులకు రాయితీలు కల్పిస్తూ సామాన్య ప్రజలపై పెను భారాలు మోపుతున్నారని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు మాచర్ల భారతి అన్నారు. ఆదివారం సీపీఎం సత్తుపల్లి పట్టణ 8వ మహాసభలో ఆమె మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్య వ్యవస్థలను నిర్వీర్యం చేసేందుకు కుట్ర పన్నుతుందన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను బీజేపీ ప్రభుత్వం హరించి వేస్తుందన్నారు. బొంతు రాంబాబు, మాదినేని రమేష్, మోరంపూడి పాండురంగారావు, విఠల్‌రావు, శ్రీనివాసరావు, రాజబాబు, రామలింగేశ్వరరావు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థికసాయం


బాధిత కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న రాంబాబు

కొణిజర్ల, అక్టోబర్ 27: మండలంలోని మంగాపురం గ్రామానికి చెందిన షేక్ జావిద్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృత్యువాతపడ్డాడు. స్థానికులు మృతుని కుటుంబానికి ఆర్థికసాయం అందజేయగా ఖమ్మం పట్టణానికి చెందిన కుంచెపు రాంబాబు రూ.20 వేలు ఆర్థికసాయం అందజేశారు. ఆదివారం జరిగిన జావిద్ దశదిన కర్మలో ఈ మొత్తాన్ని మృతిని తండ్రి షేక్ జానిమీయాకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మీటు, దాదాసాహేబ్, సైదా, లెనిన్‌బాబు, జాన్‌పాషా, కృష్ణార్జునరావు, కట్ట రాంబాబు, లవకుశ అజయ్, జామిల్, ఉద్దండు ఉన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ

నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073

నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616